క్లుప్తంగా

ముగిసిన వేసవి బడులు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కుందుర్పి: మండల వ్యాప్తంగా వేసవిలో ఏపీసీ ఓఎస్టీ సహకారంతో సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడిపిన విలువల బడులు మంగళవారం ముగిసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎస్కే లెనిన్‌బాబు తెలిపారు. ఈసందర్భంగా ఆయన శిబిరాల నిర్వహణకు సహకరించిన ఏపీసీఓఎస్టీ వారు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కోఆర్డినేటర్లు, ట్రస్టు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే విద్యార్థులు తమ చిట్టి చేతులతో 1.5 లక్షలకు పైగా విత్తన బంతులను తయారు చేసి ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా జూన్ 5న విత్తన బంతులను నాటారని తెలిపారు.

కోడ్ ముగిసినా తొలగని ముసుగు



వైఎస్సార్ విగ్రహానికి ఉన్న ముసుగు

వజ్రకరూరు: సాధారణ ఎన్నికలు పూర్తయ్యి కోడ్ ముగిసిపోయినా గూళ్యపాళ్యం గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజ శేఖర్‌రెడ్డి విగ్రహానికి ముసుగు అలాగే ఉంచారు. ఆరో తేదీనే కోడ్ ముగిసిపోయింది. అధికారులు స్పందించి వైఎస్సార్ విగ్రహం ముసుగును తొలగించాలని గ్రామస్తులు, అభిమానులు కోరుతున్నారు.

హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఎస్సీ బాలికల వసతి గృహంలో మలేరియా నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: ప్రభుత్వ హాస్టళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పనికిరాని పాత వస్తువులు వెంటనే బయట పడేయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్షుల కోదండరామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఉరవకొండలోని ప్రభుత్వ వసతి గృహాల్లో మలేరియా సబ్ యూనిట్ వర్కర్ల చేత మలాథిన్ స్ప్రే చేసే కార్యక్రమం చేపట్టారు. ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ జయమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత

కణేకల్లు: ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కణేకల్లు ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని యర్రగుంటలో మంగళవారం శాంతి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విధ్వంసాలకు దిగడం, రెచ్చగొట్టేలా వ్యవహరించడం లాంటివి చేస్తే చూస్తూ ఊరుకొనేది లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచు వన్నూరమ్మ, వీఆర్‌ఓ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి సల్మా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో మోస్తరు వర్షం



రాయదుర్గంటౌన్: నైరుతి రుతు పవనాల ప్రభావంతో రాయదుర్గం నియోజకవర్గంలో మూడు రోజుల నుంచి మోస్తరు వర్షం నమోదవుతోంది. వర్షం పడుతుండడంతో వాతావరణం చల్లబడి చల్లటి గాలులు వీస్తున్నాయి. తాజాగా మంగళవారం రాయదుర్గం పట్టణంలో సాయంత్రం జడివాన పట్టుకుంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

రాయదుర్గంటౌన్: పట్టణ శివారు 20వ వార్డు పైతోటలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం ఢీకొని ఓ ఆవు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. రాయదుర్గం మండలం వీరాపురానికి చెందిన మహేష్, సన్న ద్విచక్ర వాహనంపై కర్ణాటకలోని మొలకాల్మూరు నుంచి గ్రామానికి వస్తుండగా పైతోట వద్ద ఆవును ఢీకొన్నారు. ఆవు అక్కడికక్కడే మృతి చెందగా వారిద్దరికీ తీవ్ర రక్తగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం అనంతపురంకు తరలించారు. ఆవు మృతితో రూ.30 వేలు నష్టం వాటిల్లిందని పైతోటకు చెందిన లక్ష్మమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చిగురిస్తున్న ఆశలు

- ప్రాజెక్టుల్లోకి కొనసాగుతున్న వరదనీటి ప్రవాహం
- టీబీ డ్యాంకు 4.924 టీఎంసీలు
- బీటీ ప్రాజెక్టులో 1645.1 అడుగులు
- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీ



వరదనీటితో కళకళలాడుతున్న టీబీడ్యాం

రాయదుర్గం: కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు దిగువనున్న తుంగభద్ర (టీబీ) డ్యాంతో పాటు బీటీ ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. టీబీ డ్యాం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, మంగళవారం 4.924 టీఎంసీలకు నీరు చేరింది. అలాగే జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన బైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్టు సామర్థ్యం సముద్ర మట్టానికి 1,655 అడుగులు కాగా, ప్రస్తుతం 1645.1 అడుగుకు నీరు చేరింది. టీబీ డ్యాంలోకి 3,750 క్యూసెక్కులు, బీటీపీలోకి 200ల క్యూసెక్కులతో ఇన్ ఫ్లో కొనసాగుతోంది.

హెచ్చెల్సీ వాటా 26.36 టీఎంసీలు

ఇటీవల టీబీ బోర్డు సమావేశమై 2024-25 ఖరీఫ్‌కు 172 టీఎంసీల నీరు తుంగభద్ర డ్యామ్‌లోకి చేరొచ్చని అంచనాకు వచ్చారు. ఇందులో హెచ్‌ఎల్‌సీ వాటాగా 26.36 టీఎంసీలు తేల్చారు. దీంతో రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్, డీ హీరేహాళ్, కణేకల్లు మండలాల్లో 38 వేల ఎకరాల్లో ఆయకట్టు సాగులోకి రానుంది. మరో 10 అడుగుల మేర బీటీ ప్రాజెక్టులోకి వరదనీరు చేరితే రోటేషన్ పద్ధతి ప్రకారం గుమ్మఘట్ట లేకపోతే బ్రహ్మసముద్రం మండలంలోని ఆయకట్టుకు నీటిని సమకూర్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో టీబీ డ్యాం నుంచి నీటి కేటాయింపులు పూర్తికావడంతో రైతన్నలు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. వానలు కూడా దంచికొడుతుండడంతో బోర్ల కింద కూడా రైతులు వ్యవసాయ పనులను యుద్ధ ప్రాతిపదిన ప్రారంభించారు.

నారుమళ్లపై దృష్టిసారించిన రైతులు

నీటి లభ్యత ఆధారంగా జూలై చివర్లో ఆయకట్టుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బోర్ల కింద ముందస్తుగా రైతన్నలు నారు మళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. పంటమళ్లు చదునుచేస్తూ పలు రకాల విత్తనాలు మళ్లల్లో చల్లుకుంటున్నారు. ఇంకొందరైతే దుక్కులు దున్నడం, నేల సాంద్రత పెంచేలా పశువుల ఎరువుల వినియోగంపై దృష్టి సారించారు. ఏదిఏమైనా మృగశిర కార్తె ఆరంభంలోనే వర్షాలు ఊరిస్తుండడంతో మెట్ట ప్రాంతాల్లోనూ వేరుశనగ, కంది, ఆముదం, సజ్జ, పత్తి పంటలకు అన్నదాతలు శ్రీకారం చుడుతున్నారు. ఆయకట్టులో అనువుగా పండే సోనా రకాల్లోని బీటీపీ, ఎన్ఎల్ఆర్‌తో పాటు పలు కంపెనీలకు చెందిన విత్తనాలను కొనుగోలు చేసి నార్లు వేసుకుంటున్నారు. ఏదిఏమైనా అటు మెట్ట, ఇటు ఆయకట్టు పొలాల్లోనూ ఖరీఫ్ పనులు విస్తారంగా మొదలయ్యాయి.

కాలువల మరమ్మతుకు ప్రతిపాదనలు

తుంగభద్ర డ్యాం నుంచి హెచ్ఎల్‌సీ వాటాగా అంచనా మేరకు నీటి కేటాయింపులు చేపట్టారు. 172 టీఎంసీలు నీరు చేరినప్పుడే మన వాటగా 26.36 టీఎంసీల జలాలు వినియోగించుకునే అవకాశం ఉంది. డ్యాంలో క్రమంగా నీటి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కాలువల మరమ్మతుపై దృష్టి సారించాం. దానికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రైతులు ముందస్తుగా సాగుకు సమయత్తం అవుతున్నారు.

– మద్దిలేటి, హెచ్ఎల్‌సీ డీఈ, కణేకల్లు

మెలకువలు పాటిస్తే మేలైన దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఏ మద్దిలేటి

వజ్రకరూరు: పంటల సాగులో మెలకువలు పాటిస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా రిసోర్స్ సెంటర్ డీడీఏ మద్దిలేటి, ఏడీఏ శైలజాకుమారి పిలుపునిచ్చారు. మంగళవారం వజ్రకరూరు వ్యవసాయ కార్యాలయంలో 'ఖరీఫ్ సాగు సమాయత్తం' కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీడీఏ, ఏడీఏ మాట్లాడుతూ వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులు, వాటిలో అవలంబిస్తున్న పద్ధతులకు శాస్త్రీయత జోడించాలని సూచించారు. విధిగా విత్తన శుద్ధి ఇమిడాక్లో పిడ్‌తో చేసుకోవాలని, విత్తనం వేసిన 48గంటలలో కలుపు నివారణ పెండిమి థాలిన్‌తో చేసుకోవాలని తెలిపారు. ఎకరాకు 200 కిలోల జిప్సం పూత దశలో వేసుకుంటే విత్తన దిగుబడి బాగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ ఏడీఏ పద్మజ, మండల వ్యవసాయ అధికారులు మధుకర్, శ్రీనివాసులు, ఏఈఓలు జానమ్మ, ప్రసాద్, ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు, రైతులు పాల్గొన్నారు.

సజావుగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

గుమ్మఘట్ట: బీటీ ప్రాజెక్టుకు వరదనీరు వచ్చి చేరుతోంది. సాగునీటి కాలువ పునరుద్ధరణ పనులు ముందస్తుగా చేసేందుకు జలవనరులశాఖ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భవాని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ఆర్థిక ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. రెండో విడత వేరుశనగ ఎప్పుడు పంపిణీ చేస్తారని మండల వ్యవసాయాధికారి నిర్మల్‌కుమార్‌ను సభ్యులు ప్రశ్నించారు. త్వరలోనే పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతామని ఆయన సమాధానమిచ్చారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరీదేవి, వైస్ ఎంపీపీలు రామకృష్ణారెడ్డి, జయమ్మ, జెడ్పీటీసీ సభ్యులు పీఎస్ మహేష్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వేలంలో తగ్గిన ఆదాయం

వజ్రకరూరు: రాగులపాడులో శ్రీరామేశ్వర స్వామి, శ్రీఆంజనేయస్వామి, శ్రీ అహోబిలేశ్వరస్వామి దేవాలయాల భూములను 2024-25సంవత్సరానికి గాను కౌలు ఇవ్వడానికి అధికారులు మంగళవారం బహిరంగ వేలం ఏర్పాటు చేశారు. అయితే ఈసారి వేలంలో గతం కంటే ఆదాయం తగ్గింది. పై మూడు దేవాలయాలకు సంబంధించిన మొత్తం 45.51 ఎకరాల భూమి కౌలు రూ.1,59,500 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ అంగదాల క్రిష్ణయ్య వెల్లడించారు. గత సంవత్సరం రూ.1.61 లక్షల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.1,500 ఆదాయం తగ్గినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, కార్యనిర్వహణ అధికారి దుర్గాప్రసాద్, క్లర్క్ లాలేష, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం





అలంకరణలో సత్యనారాయణస్వామి , కలశాలను తీసుకెళ్తున్న మహిళలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని నేసేపేటలో వెలసిన వరలక్ష్మీదేవి, సత్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఆలయ గోపుర కలశాలకు భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహా గణపతి పూజ, పూర్ణాహుతి నిర్వహించారు. బుధవారం స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులకు నిశ్చితార్థం, 13న కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా మహాలక్ష్మి రథోత్సవం



కొల్హాపురి మహాలక్ష్మి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని తారకాపురం గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారి రథోత్సవం మంగళవారం సాయంత్రం గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం గంగా జలంతో అమ్మవారిని అభిషేకించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 101 మంది గొరవయ్యల నృత్యం, నందికొలు, వీరభద్ర కుణిత, మహిళా విరకాశి నాట్యాల మధ్య రథోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

కెనరా బ్యాంకు మేనేజర్‌గా లక్ష్మీపతినాయక్

విడపనకల్లు: విడపనకల్లు కెనరా బ్యాంకు మేనేజర్‌గా లక్ష్మీపతి నాయక్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. కాళసముద్రం నుంచి విడపనకల్లుకు బదిలీపై వచ్చినట్లు లక్ష్మీపతి నాయక్ తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఏసమస్య ఉన్నా ఖాతాదారులు తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు.

సబ్సిడీ కందులపై రైతుల ఆసక్తి

కూడేరు: సబ్సిడీ కందుల కొనుగోలుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని 12 రైతు భరోసా కేంద్రాలకు ఎల్ఆర్‌జీ-52 రకం కందులను 50 క్వింటాళ్లు అధికారులు కేటాయించారు. సబ్సిడీ పోను 4 కేజీల కందుల ప్యాకెట్ ధర రూ.392గా నిర్ణయించారు. 37 మంది రైతులు కందుల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా వారికి 7 క్వింటాళ్ల మేర పంపిణీ చేసినట్లు ఏఈఓ శైలజ మంగళవారం తెలిపారు. అలాగే విత్తన వేరుశనగ కోసం 2,869 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 2,500 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఇంకా విత్తన వేరుశనగ గానీ, కందులు గానీ కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు.

పగిలిన సత్యసాయి ప్రధాన పైపులైన్



గూళ్యపాళ్యం వద్ద పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సత్యసాయి కార్మికులు

వజ్రకరూరు: గూళ్యపాళ్యం పరిసర ప్రాంతంలో మంగళవారం సత్యసాయి తాగునీటి పథకం ప్రధాన పైపులైన్ పగిలింది. దీంతో మండలంలోని చాలా గ్రామాలకు తాగునీరు సరఫరా కాలేదు. ఇటీవల తరచుగా ప్రధాన పైపులైన్ పగులుతుండటంతో గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోతోంది. ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న పైపులైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఖరీఫ్ పంటలపై అవగాహన

విడపనకల్లు: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఖరీఫ్ పంటలపై రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీడీఏ మద్దిలేటి మాట్లాడుతూ వేరుశనగ సాగు చేసే రైతులు ముందుగా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల పంటలు తెగులు బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శైలజాకుమారి, ఏఓ పెన్నయ్య, శ్రీనివాసులు, ప్రసాద్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు

బొమ్మనహాళ్: అనుమతి లేకుండా రైతులకు విత్తనాలు అమ్మితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి సాయికుమార్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు వ్యవసాయశాఖ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. విత్తన కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. అనుమతి లేని విత్తనాలు, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

వజ్రకరూరు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తతో ఉండాలని వైద్యాధికారి తేజశ్వి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశాడేని పురస్కరించుకుని సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి తేజశ్వి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, ఆరోగ్య సేవలు తదితర వాటిపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వీటితో పాటు క్షయ, కుష్టు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితరులను గుర్తించి వైద్యశాలకు తీసుకురావాలన్నారు. గర్భిణులు, బాలింతలకు నెలవారీ సూదులు వేయించుకుంటున్నారా లేదా పర్యవేక్షించాలన్నారు.

మున్సిపాలిటీలో పార్టీని పటిష్టం చేద్దాం



మాట్లాడుతున్న సమన్వయకర్త తలారి రంగయ్య, పార్టీ నేతలు ఉమా, తిప్పేస్వామి

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీని పటిష్టం చేద్దామని, మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులకు తన వంతు కృషి చేస్తానని ఆ పార్టీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పలువురు కౌన్సిలర్లు, నాయకులతో కలిసి మున్సిపాలిటీలో ఎన్నికల ఫలితాలపై చర్చించారు. అనంతరం రంగయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో నాయకులు ప్రజలకు అండగా నిలవాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. మన వెంట నడచిన పార్టీ శ్రేణులకు అండగా నిలవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. రాబోవు రోజుల్లో ప్రతి ఒక్కరికీ మంచి జరుగుతుందనే నమ్మకంతో పని చేయాలని చెప్పారు. పార్టీని మరింత పటిష్టం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పలు వార్డులలో నెలకొన్న ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని చెప్పారు. వార్డుల్లో సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ముందుగా ఉంటానన్నారు. ప్రత్యేకంగా మున్సిపాలిటీకి రావాల్సిన రాష్ట్ర ప్రభుత్వ నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో పార్టీ నేతలు ఉమామహేశ్వర నాయుడు, తిప్పేస్వామి, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మండల కన్వీనర్ సర్వోత్తమ, కౌన్సిలర్లు పరమేశ్వరప్ప, లక్ష్మన్న, అర్చన, సీనియర్ నాయకులు సుధీర్, తిరుమల వెంకటేశులు, దొడగట్ట నారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, తలారి సత్తి, కో ఆప్షన్ సభ్యుడు అప్జల్, నాయకులు గోళ్ల సూరి, దివ్య, నాగరాజు, మారుతి, కిరీటి, జాకీర్, అక్కులప్ప, ఎల్‌బిసీ మురళి, హరితో పాటు పలువురు పాల్గొన్నారు.

లక్కుంటే రాయి కూడా వజ్రమే



వజ్రాల కోసం అన్వేషిస్తున్న దృశ్యం



దొరికిన రాళ్లను పరిశీలిస్తున్న వృద్ధుడు

వజ్రకరూరు: మండల కేంద్రం వజ్రకరూరు పరిసర ప్రాంతాల్లో వజ్రాల వేట ఊపందుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం ఉదయం జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి కార్లు, ద్విచక్రవాహనాలపై వేలాదిగా అన్వేషకులు తరలి వచ్చి వజ్రకరూరు పొలాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వజ్రమని అనుమానించే ప్రతి రాయిని ఎంతో భద్రంగా తీసి దాచుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పొలాల్లోనే వజ్రాల కోసం అన్వేషణ కొనసాగించారు. స్థానికంగా ఉన్న కొందరు చిరు వ్యాపారులతో పాటు జిల్లా, ఇతర జిల్లాలో ఉన్న బడా వ్యాపారులు సైతం గుట్టు చప్పుడు కాకుండా తమ ఏజెంట్లను రంగంలో దించి అన్వేషకులపై ప్రత్యేక నిఘా ఉంచారు.

దాడులు సిగ్గుచేటు

- బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: ఎన్నికల ఫలితలు వెలువడగానే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా దాడులకు తెగబడే సంస్కృతిని టీడీపీ తీసుకురావడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ అనుబంధ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన ఉరవకొండలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి టీడీపీ దాడులు– ధ్వంసరచనను ఖండించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నరసింహులు, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మండల సమన్వయకర్త మూలగిరి ఓబన్న, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందరాజులుతో కలిసి వీరన్న మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ప్రజల తీర్పును గౌరవిస్తున్నట్లు ప్రకటించారన్నారు. ఇక నుంచి ప్రజల పక్షాన నిలుస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని స్పష్టం చేశారన్నారు. అయితే టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇళ్లల్లోకి దూరి దాడులకు తెగబడుతున్నారన్నారు. ఇళ్లపై రాళ్లు రువ్వడం, నడిరోడ్డుపై కార్యకర్తలపై కర్రలతో దాడులు చేయడం ద్వారా ఆటవిక రాజ్యాన్ని గుర్తు చేశారన్నారు. ప్రభుత్వ భవనాలు, బడుల్లో సీఎం చిత్రపటాలు, శిలాఫలకాలు, బోర్డులు ధ్వంసం చేసి ప్రజలు అసహ్యించుకునేలా టీడీపీ నేతలు ప్రవర్తించారన్నారు. కవ్వింపులు.. దాడులను ఆపాలని, ప్రశాంత వాతావరణం నెలకొనేలా చూడాలని విశ్వేశ్వరరెడ్డి ఎస్పీ, ఉన్నతాధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారన్నారు. నియోజకవర్గంలో దుర్మార్గపు విషసంస్కృతిని పెంచి పోషించవద్దని టీడీపీకి సూచిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, యువనేత ప్రణయ్‌రెడ్డి ఎప్పుడూ అండగా ఉంటారని చెప్పారు. టీడీపీ నేతలు, పాలకులు దాడులకు స్వస్తి పలికి.. నియోజకవర్గ అభివృద్ధి, హామీల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఎంపీటీసీ ఈశ్వర్, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగప్ప, ఉలిగప్ప, లింగన్న, చిన్నభీమా, రామాంజినేయులు, వెలిగొండ ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

సువార్త ఉజ్జీవ సభలు జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న పాస్టర్లు, సంఘం పెద్దలు

కంబదూరు: కళ్యాణదుర్గం మార్కెట్ యార్డ్ ఆవరణలో ఈనెల 17,18,19 తేదీల్లో జరగునున్న సువార్త ఉజ్జీవ సభలను విజయవంతం చేయాలని తాలుకా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు చల్లా కిషోర్, మండలాధ్యక్షుడు ప్రభుదాస్, సీనియర్ పాస్టర్లు జేమ్స్, బసవరాజు, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ నాయకులు జోసఫ్‌కిశోర్, రవి కుమార్ కోరారు. మంగళవారం సభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక సీఅండ్‌బజీ మిషన్ చర్చిలో విడుదల జేశారు. సభలకు ముఖ్య ప్రసంగీకులుగా బుడుంపాడుకు చెందిన దైవజనులు దీవనయ్యా రానున్నట్లు వారు తెలిపారు. నియోజకవర్గంలోని క్రైస్తవ ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు ఆనంద్‌రాజ్, భూషణం, క్రైస్తవ పెద్దలు బీఎస్ సాగర్‌రాజు, ప్రభుదాస్, ఎస్ పాల్, జోఎల్, జకరయ్యా, టి.కుమార్, యాకుబ్, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వ్యాధుల నివారణ

కూడేరు: వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మండల వైద్యాధికారి సౌమ్యారెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో ఆశా డే కార్యక్రమంలో భాగంగా ఆశా వర్కర్లతో ఆమె సమావేశం నిర్వహించారు.

కార్మికులను కొనసాగించాలి

ఉరవకొండ: మధ్యాహ్న భోజన ఏజెన్సీ కింద పనిచేస్తున్న కార్మికులను యథాతథంగా కొనసాగించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం ఉరవకొండలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సీపీఎం నాయకులు రంగారెడ్డితో కలిసి కార్మికులు డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మిక సంఘం నాయకురాలు శ్రీదేవి, రామాంజినమ్మ పాల్గొన్నారు.